# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 130 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

21-03-2026 శనివారం వెల : 1 /- పేజీలు : 4






# సామాన్యుడి నుంచి సమాజానికి ఆశాకిరణం

## నిజాముద్దీన్







- నిరుపేద కుటుంబం నుంచి ప్రేరణాత్మక ఎదుగుదల
- శ్రీకాకుళం ముస్లిం సహోదరుల గుండెల్లో ప్రత్యేక స్థానం
- సేవా తత్వంతో ప్రజల మనసులు గెలుచుకున్న నాయకుడు
- అందరికీ అందుబాటులో ఉండే ఆప్యాయ వ్యక్తిత్వం
- ఎమ్మెల్యే గొండు శంకర్ మార్గదర్శకత్వంలో ముందడుగు
- మూడే నెలల్లో అభివృద్ధి పనులకు ఊపిరి తీసుకువచ్చిన నిజాముద్దీన్
- మసీదు పరిసరాల్లో మార్పుకు శ్రీకారం
- ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచిన నాయకత్వం

**జీవితంలో కొందరి ప్రయాణాలు కథలుగా మిగిలిపోతాయి... మరికొందరి ప్రయాణాలు స్ఫూర్తిగా మారిపోతాయి. కష్టాల్లో పుట్టి, కష్టాలనే ఆయుధంగా మార్చుకుని, ప్రతి అడ్డంకిని అడుగుదారిగా చేసుకుంటూ సమాజం గుండెల్లో స్థానం సంపాదించుకున్న వ్యక్తిత్వం షేక్ నిజాముద్దీన్. సాధారణ జీవితంలో ప్రారంభమైన ఆయన అడుగులు నేడు అసాధారణ నాయకత్వంగా మారి, ఒక మనిషి సంకల్పం ఉంటే ఎంత ఎత్తుకైనా ఎదగగలడని నిరూపిస్తున్న సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి.**

**ప్రజల మధ్యే జీవిస్తూ, వారి కష్టాల్లో భాగస్వామిగా నిలుస్తూ "మనోడు" అనే అనుబంధాన్ని సంపాదించుకున్న పేరు నిజాముద్దీన్. నాయకత్వం అంటే అధికారమో, హోదాలో కూర్చోవడమో కాదని... ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవడమేనని ఆయన తన జీవితం ద్వారా చాటుతున్నారు. అందుకే ఈరోజు శ్రీకాకుళం ముస్లిం సహోదరుల గుండెల్లో ఆయన ఒక పేరు కాదు... ఒక నమ్మకం, ఒక ఆధారం, ఒక ఆశాకిరణంగా నిలిచారు.**

(నవతరం ప్రతినిధి – శ్రీకాకుళం)

పేదరికం ఆయనను ఆపలేదు... పరిస్థితులు ఆయనను వెనక్కి లాగలేకపోయాయి... తనపై నమ్మకం, సమాజంపై ప్రేమతో ఆయన ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఆ ప్రయాణంలో సంపాదించుకున్నది కేవలం పేరు మాత్రమే కాదు... ప్రజల హృదయాల్లో ఒక ప్రత్యేక స్థానం. శ్రీకాకుళం ముస్లిం సహోదరుల మధ్య "మనోడు" అనే అనుబంధంతో పలకరింపబడే పేరు నిజాముద్దీన్.

అవసరం ఉన్నప్పుడు ముందుండి నిలబడటం, బాధలో ఉన్నవారికి భరోసా ఇవ్వడం, సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా స్వీకరించడం ఆయన సహజ స్వభావం. అందుకే ఆయన చుట్టూ కనిపించేది కేవలం జనసమ్మర్థం కాదు... అది నమ్మకం, ప్రేమ, గౌరవం కలిసిన బంధం. పెద్దలు ఆయనలో బాధ్యత గల నాయకత్వాన్ని చూస్తే, యువత ఆయనలో తమ భవిష్యత్తుకు దారిని కనుగొంటోంది.

ఎమ్మెల్యే గొండు శంకర్ మార్గదర్శకత్వంలో ముందుకు సాగుతూ సేవా కార్యక్రమాలకు కొత్త దిశను తీసుకువస్తున్నారు. నాయకత్వం అంటే అధికార ప్రదర్శన కాదని... ప్రజల మధ్య ఉండి వారి అవసరాలను అర్థం చేసుకుని పనిచేయడమేనని ఆయన నిరూపిస్తున్నారు. మాటలకంటే చేతలతోనే విశ్వాసం గెలుచుకుంటున్నారు.

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జామియా మసీదులో అభివృద్ధి పనులకు ఊపిరి తీసుకొచ్చారు. సోలార్ ఆధారిత 15 విద్యుత్ దీపాల ఏర్పాటు, మసీదు మరమ్మతులు, ప్రహరీ గోడ నిర్మాణం, అంతర్గత రహదారుల అభివృద్ధి వంటి పనులకు శ్రీకారం చుట్టారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో ఈ పనులు ముందుకు సాగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో నిజాముద్దీన్ చురుకైన పాత్ర పోషిస్తూ ఎమ్మెల్యే శంకర్ అడుగుజాడల్లో నడుస్తున్నారు.

జామియా మసీదు కమిటీ బాధ్యతలు చేపట్టిన తర్వాత, కేవలం మూడు నెలల్లోనే మసీదు అభివృద్ధికి కోటిన్నర రూపాయల నిధులకు పరిపాలనా అనుమతులు సాధించడం ఆయన చొరవకు నిదర్శనం. నిధులు విడుదల దశలో ఉండగా, అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయి.

ఇదిలా ఉండగా, ఇమామ్, మౌజన్‌లకు రూ.45 కోట్లు గౌరవ వేతనాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు నిజాముద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ముస్లిం మైనార్టీలకు ఆర్థిక భరోసా కల్పించిందని ఆయన పేర్కొన్నారు.

సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కూడా ఆయన పాత్ర విశేషం. మత భేదాలు దాటి అందరినీ కలుపుకుని నడిపించే ఆయన ధోరణి, నిజమైన నాయకత్వానికి అద్దం



పడుతోంది. "మనుషుల మధ్య ప్రేమే పెద్దది" అనే భావనను ఆయన తన సేవా కార్యక్రమాల ద్వారా ప్రతిరోజూ చాటుతున్నారు.

ఈరోజు నిజాముద్దీన్ పేరు వినగానే, శ్రీకాకుళం ముస్లిం సహోదరుల గుండెల్లో గౌరవం ఉప్పొంగుతుంది. ఒక నాయకుడిగా కాకుండా, ఒక కుటుంబ సభ్యుడిగా, ఒక సహోదరుడిగా, ఒక ఆశ్రయంగా ఆయన నిలుస్తున్నారు.

సామాన్యుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం... నేడు సమాజానికి ఆశాకిరణంగా మారింది. ఆయన అడుగుజాడల్లో నడవాలని అనుకునే కొత్త తరం నాయకులకు, ఇది కేవలం కథ కాదు... ఒక స్ఫూర్తి, ఒక దారి, ఒక నమ్మకం.

# జిల్లాలో రైల్వేలు అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తాం

- హరిశ్చంద్రపురం, మందస, పాతపట్నం స్టేషన్‌లలో నూతన హాల్ట్‌లను ప్రారంభించిన కేంద్ర మంత్రి.
- రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, వైద్య అవసరాలకు తాజా హాల్టులు ఉపయుక్తం
- జిల్లాలో ప్రతీ స్టేషన్ ను అభివృద్ధి చేసుకుని వచ్చాం.. భవిష్యత్ లో మరిన్ని విప్లవాలు సృష్టిస్తాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.





(నవతరం - శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లాలో రైల్వే వ్యవస్థను మరింత విస్తృత పరుస్తామని కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం నాడు జిల్లాలోని కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ లో విశాఖ - గుణపూర్ పాసింజర్ రైలు హాల్ట్ ను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తో కలసి ప్రారంభించారు. అదేవిధంగా మందస రోడ్ రైల్వే స్టేషన్ లో బెర్హాంపూర్ విశాఖపట్నం ఎక్స్ప్రెస్ ను కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. పాతపట్నం లో రోర్కెల గుణపూర్ రాజ్యరాణి ఎక్స్ప్రెస్ ల నూతన హాల్టు ను స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు లతో కలసి ప్రారంభించారు. అంతకు ముందు మూడు చోట్ల ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు.

హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి హామీ ఇచ్చి.. కొద్ది రోజుల్లోనే హాల్ట్ మంజూరు అయ్యేలా కృషి చేసిన రామ్మోహన్ నాయుడు కు ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వచ్చేలా చెయ్యాలని కోరారు. హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ కు చేరుకునే అప్రోచ్ రోడ్లను విస్తృతం చెయ్యాలని కోరారు. అదే విధంగా నందిగాం - రౌతుపురం లో రోడ్డు అభివృద్ధి, టెక్కలి లో ఉన్న రైలు గేటును డబుల్ గేట్ గా విస్తృత పరచాలని అచ్చెన్నాయుడు కోరారు. దీనిపై రైల్వే అధికారులు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు లు దృష్టి సారించాలన్నారు. అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సభ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు. హరిశంద్రపురం రైల్వే స్టేషన్ లో ట్రైన్ హాల్ట్ కోసం విశేష ప్రయత్నం చేశామని.. ఉగాది పర్వదినం సమీపంలో అది సాకారం అవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సర్వీస్ ద్వారా స్థానిక రైతులకు, మహిళలకు, విద్యార్థులకు మరింత ఉపయుక్తంగా మారనుందని అన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, గుణపూర్ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ అభివృద్ధికి హద్దులు చెరిపేస్తున్నట్లు రామ్మోహన్ నాయుడు అన్నారు. హరిశ్చంద్ర పురం స్టేషన్ లో ఇరవై ఏళ్ళ క్రితం ఎలా ఉంది, ఈరోజు ఎలా ఉంది అనే తేడాను ప్రజలు గమనించాలని అన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న హరిశ్చంద్ర పురంలో అభివృద్ధి చేస్తే స్థానికంగా విశేష ఉపాధి వనరులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ప్లాట్ ఫాం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, స్టాపేజి.. ఇలా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. స్టేషన్ ను ఆనుకుని రైల్వే పరిధిలోని 40 ఎకరాలను సైతం అభివృద్ధి చేస్తామని, తద్వారా ఉపాధి అందుతుందని తెలిపారు. వేర్ హౌస్, గూడ్స్ షెడ్, కంటైనర్ టెర్మినల్ లాంటి వాటిని ఇక్కడ ఏర్పాటు చేస్తామని అన్నారు. స్థానిక ప్రజలు కూడా నూతన హాల్ట్ సర్వీసులను ఎక్కువగా ఉపయోగించుకోవాలని కోరారు.

రైల్వే జోన్ ను విశాఖ లో త్వరలో ప్రారంభిస్తామని.. ఇకపై మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు కార్యరూపం దాల్చుతాయని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు కోరిన అభివృద్ధి పనులు కూడా అతి త్వరలో చేరువ చేస్తామని హామీ ఇచ్చారు. చాలామంది లీడర్లు కేంద్ర ప్రభుత్వ స్థలం లో అభివృద్ధికి కేంద్రం నిధులపై ఆశపడతారని.. కానీ అచ్చెన్నాయుడు గారు అందుకు భిన్నంగా అనుమతులు మీరివ్వండి.. అభివృద్ధి మేము చేసుకుంటామని అనడం.. ఆయనకు మాత్రమే చెందిందని కితాబిచ్చారు. పోర్టు ఏర్పాటు ద్వారా అటు రాయ్ పూర్ నుండి ఇటు ఒడిశా వరకు అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సాల్ట్ భూముల సమస్యను పరిష్కరించామని అన్నారు.. అభివృద్ధి చేస్తూ ఉన్నామని.. కంపెనీలు రావడమే ఆలస్యం అని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఇరవై లక్షల ఉద్యోగాల హామీ తో కూటమి సర్కారు ఉపాధి దిశగా బలమైన అడుగులు వేస్తోందని అన్న రామ్మోహన్ నాయుడు.. అందుకు ఉత్తరాంధ్ర లో కూడా సమాన ప్రాధాన్యత దక్కుతుందని ఆనందం వ్యక్తం చేశారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ భావాన్ని మరింతగా విస్తృత పరుస్తున్నామని తెలిపారు. ప్రపంచం ఇప్పుడు భారత దేశం వైపు చూస్తుంటే.. భారత్ వచ్చిన సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తూ ఉండటం శుభపరిణామం అని అన్నారు. గూగుల్ లాంటి సంస్థ లక్ష ముప్పై వేల కోట్లు అడుగు దూరంలోని విశాఖ లో పెట్టుబడి పెట్టడం, మిట్టల్ స్టీల్ ప్లాంట్ 80 వేల కోట్లతో 23న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తున్నారన్నారు. వీటితో పాటు మూల పేట పోర్ట్, రేర్ ఎర్త్ మినరల్స్ ద్వారా అనేక ఇండస్ట్రీలు రానున్నాయని ధీమా వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల ఆశీస్సులు శ్రీకాకుళం జిల్లాపై మెండుగా ఉన్నాయని.. కూటమిలో సిక్కోలు మరింతగా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. వరుసగా కేటాయింపులు, అభివృద్ధి పనులకు సహకారం అందిస్తున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు ఈ సంధర్భంగా రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. నలభై ఐదు రోజుల వ్యవధిలోనే 6 స్టాపులు శ్రీకాకుళం లో మంజూరు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్ లో సమీప స్టేషన్ లో ప్రశాంతి ఎక్స్ప్రెస్, ఇతర రైళ్ళను కూడా స్టాపేజి కల్పిస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నుండి నేరుగా సికింద్రాబాద్, తిరుపతి లకు రైళ్ల ఏర్పాటు కోసం విశేష కృషి చేస్తున్నట్టు తెలిపిన రామ్మోహన్ నాయుడు.. అందుకు రైల్వే శాఖ నుండి, మంత్రి అశ్వినీ వైష్ణవ్ నుండి సానుకూల స్పందన వచ్చినట్టు తెలిపారు. సర్వేలు కూడా ఈ విషయంపై సాగుతున్నట్టు అన్నారు.

జిల్లాలో రైల్వే ల అభివృద్ధికి తన తండ్రి దివంగత కింజరాపు ఎర్రంనాయుడు గారు విశేష కృషి చేశారని.. ఆయన ఆశయ సాధనకు తాను ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు.

మందస రోడ్ రైల్వే స్టేషన్ లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి విస్తరణకు ప్రణాళిక సిద్ధం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. మందస స్టేషన్ లో భవిష్యత్లో మరిన్ని హాల్ట్ లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పాతపట్నం లో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ భవిష్యత్ లో పాతపట్నం నుండి వారంతపు ఎక్స్ప్రెస్ రైళ్ల నిలుపుదల కు కృషి చెయ్యాలని కోరారు.

అనంతరం పాతపట్నం లో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కీలక హామీలు ఇచ్చారు. దేశంలో ఎక్కడ లేని విధంగా.. ఒక జిల్లాలో 45 రోజుల వ్యవధిలోనే ఆరు నూతన హాల్టు ల మంజూరు జరగడం ఆనందంగా ఉందని అన్నారు. మూలపేట పోర్ట్ ఏర్పాటు నేపథ్యంలో ఆ పోర్టుకు ఒరిస్సాను అనుసంధానం చెయ్యడం లో పాతపట్నం స్టేషన్ కీలకంగా మారుతుందని అన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో సాగునీరు, త్రాగునీరు ప్రాజెక్టులకు, జల్ జీవన్ మిషన్ కు, కరకట్టల నిర్మాణం కు అధిక కేటాయింపులు జరుగుతున్నాయి అన్నారు.

12 ఏళ్లుగా శ్రీకాకుళం జిల్లా పరిధిలో రైళ్ల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామని.. షెల్టర్లు, స్టాపేజీలు, మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతూ విశేష వృద్ధి సాధించామని తెలిపారు. రైల్వే స్టాండింగ్ కమిటీ మెంబర్ గా ఎర్రన్నాయుడు గారు విశేష కృషి చేశారని.. నారో గేజ్ ను బ్రాడ్ గేజ్ గా మార్చారని అన్నారు. ఈ నౌపడ గుణపూర్ లైన్ ను 1200 కోట్లతో మరింతగా పొడిగిస్తున్నామని హామీ ఇచ్చారు. అదేవిధంగా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాతపట్నం, టెక్కలి స్టేషన్ లను క్రాసింగ్ స్టేషన్ల గా మార్చుతామని హామీ ఇచ్చారు. ఈ నౌపడ, టెక్కలి పాతపట్నం లైన్ ను డబుల్ లైన్ గా మార్చడానికి కూడా కృషి చేస్తున్నామని ఆర్.డి.ఓ ద్వారా సర్వే ప్రయత్నాలు కూడా చేస్తున్నామని తెలిపారు. 9కోట్ల రూపాయలతో నితిన్ గడ్కరీ దగ్గర కూర్చొని నీలమణి దుర్గ ఆలయం వద్ద ఫ్లై ఓవర్ మార్పులు చేశామని తెలిపారు.

ప్రధాని మోదీ ధీటైన నాయకత్వంతో దేశం అభివృద్ధి వైపు వేగంగా పయనిస్తూ ఉంటే.. సర్వనాశనం అయిన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర వైపు నడిపిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుధని అన్నారు. ఇప్పుడు రాష్ట్రం వైపు పెట్టుబడులు వెతుక్కుని వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ రైల్వే డి.ఆర్.ఎమ్ లలిత్, ఖుర్దా డి.ఆర్.ఎం సునీల్, యార్లగడ్డ వెంకన్న చౌదరి, రైల్వే అధికారులు, కూటమి శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఫరీద్ పేట హై స్కూల్ లో మధ్యాహ్న భోజన షెడ్ నిర్మాణం
- విద్యార్థులకు స్వయంగా భోజనాలు వడ్డించిన ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు



(నవతరం - శ్రీకాకుళం)

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థానాలకు తీసుకు వెళుతుందని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని ఫరీద్ పేట హై స్కూల్ లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇబ్బందిగా ఉన్న విషయాన్ని తెలుసుకొని, 1999 10వ తరగతి విద్యార్థుల బ్యాచ్ సహకారంతో నూతనంగా షెడ్ ను నిర్మించారు. ఈ షెడ్డు ను శుక్రవారం ఆయన ప్రారంభించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఒక గమ్యాన్ని ఏర్పాటు చేసుకొని దాన్ని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు.

వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని ఆ దశలో మనం ఎంచుకున్న రంగాలను బట్టే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని చెప్పారు. నేడు మారుతున్న శాస్త్ర సాంకేతిక రంగాలలో విద్యార్థులు రాణించాలంటే విద్యతో పాటు సృజనాత్మక శక్తి కూడా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు తోడ్పాటున అందించేందుకు తను ఎప్పుడో ముందుంటానని ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలలో పరీక్షకులను అందజేయడం జరిగిందని వాటితో పాటు ఫరీదుపేటలో షెడ్డు నిర్మించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

# 30న మూలపేట పోర్టు సందర్శన

- మాజీ డిప్యూటీ సీఎం కృష్ణదాస్
- మబుగాంలో పాతపట్నం నియోజకవర్గ నేతలతో సన్నాహక భేటీ



నవతరం -పోలాకి

శ్రీకాకుళం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన మూలపేట పోర్టును ఈ నెల 30వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉన్నత స్థాయి అధికార బృందం సందర్శించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ వెల్లడించారు. శుక్రవారం పోలాకి మండలం మబుగాంలో పాతపట్నం నియోజకవర్గ నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గ సమన్వయకర్త రెడ్డి శాంతితో కలిసి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలోనే మూలపేట పోర్టు పనులు 85 శాతం మేర అత్యంత వేగంగా పూర్తయ్యాయని గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే విధంగా, వలసల నివారణే యు ధ్యేయంగా జగన్ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారని కొనియాడారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా, మిగిలిన 15 శాతం పనులను పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. కనీసం ట్రయల్ రన్ కూడా నిర్వహించలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం దారుణమన్నారు.

జిల్లా అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి పోర్టును సందర్శించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రాంతీయ యాత్ర ద్వారా జగన్ హయాంలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తుత పనుల జాప్యాన్ని ప్రజలకు వివరిస్తామని స్పష్టం చేశారు. 30వ తేదీన జరగనున్న ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ధనా..ధన్ రఘునందన్



గ్యాస్ దందా పై కొరడా ఝుళిపించిన సివిల్ సప్లైస్ డి టి

గ్యాస్ అక్రమ దందా ను ఉపేక్షించే ప్రసక్తే లేదని, క్రిమినల్ కేసు నమోదు చేయడం ఖాయం అని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. శుక్రవారం నాడు ఆయన చందూరు లో ఆకస్మిక తనిఖీ లు చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..చందూరు లో ఏనుగు సత్తి రెడ్డి అనే వ్యక్తి వద్ద కొన్ని ఖాళీ సిలిండర్లు ఉండటమే గాక..ఇతరుల గ్యాస్ పాస్ పుస్తకాల ను అనధికారికంగా కలిగి ఉన్నట్టు తెలిపారు.

అతని ఇంట్లో కూడా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ లు ఎక్కువగా ఉండటం అనుమానాలకు తావు ఇవ్వడం తో..గ్యాస్ పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు రఘునందన్ వివరించారు. పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ దాడుల్లో.. త "నేను గతం లో గ్యాస్ దందా చేసింది నిజమే కానీ ఇపుడు చేయటం లేదు" అని ఒప్పుకున్నట్టు రఘునందన్ వివరించారు. ఒకే ఇంట్లో ఉన్న ఇద్దరు వ్యక్తుల కు డబుల్ గ్యాస్ కనెక్షన్ ఉండటం,గ్యాస్ ఏజన్సీ నుంచి అధికంగా సిలిండర్ లు తీసుకుని దందా చేసే అవకాశం ఉందని రఘునందన్ అనుమానం వ్యక్తం చేశారు.

ఈ తనిఖీల్లో పౌర సరఫరాల శాఖ ఓ ఎస్ డీ రావుల అంజయ్య పాల్గొన్నారు.

# చిన్న గొడవ... మోహన్ కృష్ణ ప్రాణం బలి

- వీధి వాగ్వాదం తోపులాటగా మారి విషాదం
- తలకు గాయంతో యువకుడు మృతి
- నిందితుడు అదుపులో... కేసు నమోదు
- ఎమ్మెల్యే గొండు శంకర్ సంతాపం, కఠిన చర్యల హామీ
- నేతలు, కార్యకర్తల అశ్రునివాళులు





**నవతరం శ్రీకాకుళం**

వీధిలో జరిగిన చిన్నపాటి గొడవ యువకుడి ప్రాణాన్ని బలితీసుకుంది. అసలు పరిచయం లేని ఇద్దరి మధ్య వాగ్వాదం తోపులాటకు దారి తీసి, తలకు తీవ్ర గాయమవడంతో మండలవీధికి చెందిన గొర్లె మోహన్ కృష్ణ (26) మృతి చెందడం నగరంలో కలకలం రేపింది.

గురువారం రాత్రి సమావేశం ముగించుకుని ఇంటికి వస్తున్న మోహన్ కృష్ణ, ఉమెన్స్ కళాశాల సమీపంలో తన మేనల్లుడు కొందరు యువకులతో ఉండటాన్ని గమనించి మందలించాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న మనోహర్ అలియాస్ మనోజ్ కల్పించుకోవడంతో మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. మనోజ్ బలంగా నెట్టడంతో మోహన్ కృష్ణ కిందపడిపడి తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మృతిగా నిర్ధారించారు.
సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడు మనోజ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. తలకు గాయమే మృతికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం రిమ్స్‌కు తరలించారు.



మోహన్ కృష్ణ జిల్లా పార్టీ కార్యాలయంలో బాధ్యతలు నిర్వహిస్తూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్నాడు. ఆయన మృతిపై పలువురు నేతలు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. మృతదేహాన్ని అంతిమయాత్రగా తీసుకెళ్తూ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు భావోద్వేగానికి గురయ్యారు.
ఈ ఘటనపై ఎమ్మెల్యే గొండు శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, మోహన్ కృష్ణ మృతి తనను కలచివేసిందన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, మృతుడి కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# డ్రగ్స్ కేసుపై ఎంపీపై చర్యలు తీసుకోవాలి: ఏఐవైఎఫ్

- పుట్టా మహేష్ కుమార్ సస్పెన్షన్ డిమాండ్
- సీఎం, లోకేష్ నైతిక బాధ్యత వహించాలని పిలుపు




**నవతరం శ్రీకాకుళం**

డ్రగ్స్ కేసులో పట్టుబడిన తెలుగుదేశం పార్టీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. స్థానిక సూర్య మహల్ జంక్షన్ వద్ద నిర్వహించిన ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమొజ్జాడ యుగంధర్ మాట్లాడుతూ, ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిందన్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి ఇలాంటి కేసులో చిక్కుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నైతిక బాధ్యత వహించాలని, కేసుపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ సమస్యపై కఠిన చర్యలు తీసుకోవాలని, యువతలో అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా చోరీల ముఠా బట్టబయలు

- వివిధ జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు అరెస్ట్
- విలువైన వస్తువులు, నగదు స్వాధీనం
- పలు ప్రాంతాల్లో 10 కేసులు నమోదు
- పోలీసుల సమన్వయంతో ముఠా అరెస్ట్
- నిందితులను రిమాండ్‌కు తరలింపు



**నవతరం శ్రీకాకుళం**

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. లావేరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి చోరీకి సంబంధించిన పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.
పోలీసుల వివరాల ప్రకారం... ఫిబ్రవరి 23న లావేరు ప్రాంతంలోని ఓ మద్యం దుకాణంలో చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. ఈ క్రమంలో నయాని ప్రభు కుమార్, బైరెడ్డి మోహన్ కుమార్ అలియాస్ పండు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.
నిందితులు రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో మొత్తం 10 దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. వీరిలో ప్రధాన నిందితుడిపై 22 కేసులు, మరో నిందితుడిపై పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుండి నగదు, డీవీఆర్ పరికరాలు, రౌటర్ బాక్సులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా రాత్రి సమయంలో దుకాణాలు లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు.
జిల్లా పోలీసు అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు పని చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ



- పేద ముస్లిం కుటుంబాలకు సహాయం
- లౌకికవాదానికి కాంగ్రెస్ కట్టుబాటు: అన్నాజీ రావు

**నవతరం శ్రీకాకుళం**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు.
ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డిసిసి అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు ఆధ్వర్యంలో, జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎం.ఎం. బేగ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నాజీ రావు మాట్లాడుతూ, అన్ని కులాలు, మతాలను సమానంగా భావించే కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదలకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేకంగా నల్ల రిబ్బన్ నిరసనలు



- భూసేకరణ నిలిపివేయాలని డిమాండ్
- మార్చి 23 నుంచి గ్రామాల్లో నిరసనలు
- ప్రజల ఆస్తులను కాపాడాలని పిలుపు

**నవతరం -పలాస**

కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టును రద్దు చేసి, బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మార్చి 23 నుంచి 31 వరకు అన్ని గ్రామాల్లో నల్ల రిబ్బన్ ధరించి నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం సరైంది కాదన్నారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా, మొక్కలను నరికి ప్రాజెక్టు చేపట్టడం పర్యావరణానికి హానికరమని విమర్శించారు. ప్రభుత్వం నిర్బంధ చర్యలను ఆపాలని, ప్రజల హక్కులను గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పేద మహిళకు అండగా ఆటో డ్రైవర్ రక్తదానం

- మానవత్వం చాటిన ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధి
- పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఘటన



**నవతరం -పాలకొండ**

పేద మహిళకు అండగా నిలుస్తూ ఆటో డ్రైవర్ రక్తదానం చేసి మానవత్వాన్ని చాటాడు. పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నూకాల లక్ష్మి అనే మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమైన సందర్భంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ప్రతినిధి పామోటి సింహాచలం ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అక్కడున్నవారు సింహాచలం సేవాభావాన్ని అభినందించారు. సమయానికి అందిన ఈ సహాయం వల్ల బాధితురాలికి ఉపశమనం కలిగిందని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# తాగునీటి సమస్యలపై ఫిర్యాదుకు హెల్ప్‌లైన్ నంబర్

**నవతరం శ్రీకాకుళం**

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఫిర్యాదు చేసేందుకు జిల్లా గ్రామీణ తాగునీటి సరఫరా, పరిశుద్ధ్య విభాగం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు 9100120602 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు.
ఈ హెల్ప్‌లైన్ సేవలు మార్చి 17వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండి ఫిర్యాదులను స్వీకరిస్తారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ శంకర బాబు ఒక ప్రకటనలో కోరారు.

# కొత్త తరానికి ఆదర్శం: నిజాముద్దీన్





(నవతరం - శ్రీకాకుళం)

- జామియా మసీదుకు వందల ఏళ్ల చరిత్ర
- మక్కా మసీదు తర్వాత అతి పెద్ద మసీదు
- పాత్రికేయులకు తొలిసారి ప్రత్యేక ఇఫ్తార్ విందు
- కోటిన్నర నిధులతో అభివృద్ధికి ఊతం

నగరంలోని జామియా మసీదు వందల ఏళ్ల చరిత్రను కలిగి ఉందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ తెలిపారు. గురువారం రాత్రి జామియా మసీదు కమిటీ నిర్వహించిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన, ముస్లిం సమాజం మరియు శ్రీకాకుళం జిల్లాకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మక్కా మసీదు తర్వాత అతి పెద్ద మసీదుగా జామియా మసీదు ప్రత్యేక స్థానం పొందిందన్నారు.
ఏపీఎంఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డోల అప్పన్న మాట్లాడుతూ, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనవాయితీ అయినప్పటికీ, పాత్రికేయులకు ప్రత్యేకంగా విందు ఇవ్వడం ఇదే తొలిసారి అని తెలిపారు.
నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ (నారా) జిల్లా అధ్యక్షుడు భాసూరు సాయి, శిరిగిరి నవచైతన్యలు జామియా మసీదు నూతన పాలకవర్గాన్ని అభినందించారు.
జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నిజాముద్దీన్ మాట్లాడుతూ, నూతన కమిటీ ఏర్పడిన మూడు నెలల్లోనే మసీదు అభివృద్ధికి కోటిన్నర రూపాయల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. మసీదు అభివృద్ధి, భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే గొండు శంకర్ సహకారంతో మరింత అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మసీదును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో జామియా మసీదు ఇమామ్ మహమ్మద్ జియావుద్దీన్ రెహమాన్ (ముఫ్తీ), ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ వహాబ్, మౌజన్ మహమ్మద్, మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎండి యాసిన్, కోశాధికారి మీర్ అసదుల్లా, జాయింట్ సెక్రటరీ షేక్ సలీం, సభ్యులు తదితరులు, పలువురు జర్నలిస్టులు, ముస్లిం మత పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పలాసలో పార్టీ బలపర్చడంపై దృష్టి

- కార్యకర్తలే వెన్నెముకగా పార్టీ బలోపేతానికి పిలుపు
- క్షేత్రస్థాయి సమన్వయంతో విజయాల సాధనపై దృష్టి
- పైవంతెనలు, రహదారి విస్తరణకు భారీ నిధుల కేటాయింపు
- కేంద్ర విద్యాలయం ప్రారంభం, మత్స్యకార గ్రామాల్లో అభివృద్ధి పనులు
- సాగునీరు, పారిశ్రామిక వృద్ధికి ప్రభుత్వ చర్యలు

నవతరం-పలాస



పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలే వెన్నెముక అని, వారి సమన్వయంతోనే భవిష్యత్ విజయాలు సాధ్యమవుతాయని పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి అందరూ ఒకే కుటుంబంలా పనిచేస్తేనే పార్టీ మరింత బలపడుతుందని తెలిపారు.
ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ఇలాంటి సమావేశాలు పార్టీ బలోపేతానికి దోహదపడతాయని, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పైవంతెనల నిర్మాణానికి రూ.120 కోట్లకు పైగా నిధులు, పలాస-కాశీబుగ్గ రహదారి విస్తరణ, కేంద్ర విద్యాలయం ప్రారంభం, మత్స్యకార గ్రామాల్లో సౌర దీపాలు, తీర రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను వివరించారు.
ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీకి నూతన ఉత్సాహాన్ని నింపారు.

# తెలుగు భాషా పరిరక్షణ అందరి బాధ్యత



(నవతరం - శ్రీకాకుళం)

- వైస్ ఛాన్సలర్ కెఆర్ రజిని
- తోట వారి కథలు, స్పందన పుస్తకాల ఆవిష్కరణ
- హిందీ ప్రచార సభ డైరీల ఆవిష్కరణ
- ఘనంగా కవి సమ్మేళనం

తెలుగు భాషా పరిరక్షణ అందరి బాధ్యత అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కే. ఆర్.రజిని అన్నారు. తెలుగు రచయితల వేదిక (తెరవే ) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక హోటల్ గ్రాండ్ లో జరిగిన ఉగాది సంబరాలు మరియు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రజిని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కేఆర్ రజిని మాట్లాడుతూ తెలుగు కవులు, జర్నలిస్టులు , రచయితలు తెలుగు భాషా సాహిత్యల సంస్థల ద్వారా తెలుగు భాషా పరిరక్షణ జరుగుతోందని ప్రశంసించారు. మాతృభాషను రక్షించుకోవడం అన్ని వర్గాల బాధ్యత అని రజిని పేర్కొన్నారు. ఉగాది సంబరాలు, పుస్తకాల ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు చేపట్టడం తెలుగు రచయితల వేదిక చేస్తున్న కృషిగా రజిని ప్రశంసించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ పి. జగన్మోహనరావు మాట్లాడుతూ, తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల ప్రచారానికి తెరవే చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విశ్రాంతి డీఈవో బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, నెలవారీ కార్యక్రమాలతో పాటు, మరికొన్ని పెద్ద కార్యక్రమాలతో తెలుగు సాహిత్య వికాసానికి తెరవే కృషి చేస్తుందని అన్నారు. తెరవే ప్రధాన కార్యదర్శి ఆర్.వి. రమణమూర్తి మాట్లాడుతూ, తెరవే ఆవిర్భావం, ఆశయాలను వివరించారు. తెరవే అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సభ్యుడు కోనే శ్రీధర్ సభా కార్యక్రమాన్ని నిర్వహించారు.
తెరవే సభ్యుడు తోట గోపాలరావు రచించిన తోట వారి కథలు, స్పందన కవితా సంపుటి పుస్తకాలను వైస్ ఛాన్సలర్ కేఆర్. రజిని ఆవిష్కరించి పంపిణీ చేశారు.
స్పందన కవితా సంపుటిని డాక్టర్ ముట్నూరు ఉపేంద్ర శర్మ సమీక్షించగా, తోట వారి కథలు పుస్తకాన్ని పి.ఎస్. నాగరాజు సమీక్షించారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ వార్షిక డైరీలను కె. ఆర్. రజిని ఆవిష్కరించారు. తెరవే , హిందీ మంచ్ సంస్థల తరపున వైస్ ఛాన్సలర్ కేఆర్ రజినిను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనం కార్యక్రమాన్ని కిల్లాన శ్రీనివాస్, భోగిల ఉమామహేశ్వరరావు, ఇద్దిి పాపయ్యలు నిర్వహించారు. 50 మంది కవులు పాల్గొని స్వీయ కవితలను వినిపించారు. భోగిల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఐ ఎన్ డి ప్రసాద్ ఇద్దిి పాపయ్యలు తొలుత ప్రతిస్పందన అనే నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో డబ్బీరు గోవిందరావు, మణిపాత్రుని నాగేశ్వరరావు, డాక్టర్ బారువ కోమలరావు, గుడిమెట్ల గోపాలకృష్ణ మంగిపూడి శ్రీనివాసరావు, లలితా రెడ్డి,పత్తి సుమతి, వాంద్రంగి కొండలరావు, వి.రాజారావు, నిక్కు సత్యనారాయణ, బుడుమూరు సూర్యరావు, బస్వా జగన్నాధ రావు టి లింగరాజు పివి దుర్గాప్రసాద్ తేజస్విని తోట మాధురి తోట కళ్యాణ్, హిందీ మంచ్ కనుగుల సత్యం, రొంపివలస రామారావు, పొట్నూరు మాలతి,టి.ఎర్రమ్మ,చాడ శ్రీనివాస్, రోణంకి విశ్వేశ్వరరావు, టి. విజయ లక్ష్మణ్, బాలాజీ రవికిరణ్, మోహన్ గాంధీ, బి. త్రినాధరావు, కే. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# నీరే ప్రాణాధారం.. వృథా చేస్తే భవిష్యత్తు శూన్యం




(నవతరం - శ్రీకాకుళం)

నీరే జీవనాధారం, నీరు లేనిదే భవిష్యత్తు శూన్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం (మార్చి 22) పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా న్యాయ సేవా సదన్ నుండి డే అండ్ నైట్ కూడలి వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా కాపాడాలని, రేపటి తరాలకు నీటిని అందించడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. మన చుట్టూ సముద్రం ఉన్నా, తాగడానికి గుక్కెడు మంచి నీరు దొరకని పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఒక్కో నీటి బొట్టును పొదుపు చేసి భావి తరాల గొంతులు తడపాలని ఆయన ఆకాంక్షించారు.

## ర్యాలీలో ప్రతిజ్ఞ.. మానవహారం

ప్రజల్లో నీటి వినియోగంపై చైతన్యం తీసుకురావడానికి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి మానవహారం నిర్వహించారు. ప్లకార్డులు, పోస్టర్ల ద్వారా నీటి సంరక్షణపై నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కె. అమ్మోజి రావు, జి.ఇందిరా ప్రసాద్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# అంతర్విశ్వవిద్యాలయ ఖో-ఖో పోటీలకు ఐతం విద్యార్థుల ఎంపిక

నవతరం-టెక్కలి

ఐతం కళాశాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు సౌత్ జోన్ అంతర్విశ్వవిద్యాలయ ఖో-ఖో పోటీలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు తెలిపారు.ఈ నెల 26 నుండి కర్ణాటక రాష్ట్రంలోని ద్వాలగిరి విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఖో-ఖో పోటీలలో ఐతం విద్యార్థులు పాల్గొనున్నారు. ఇటీవల జెఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రఘు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాల ఖో ఖో పోటీలలో ఇ సి ఇ విభాగం నుండి కె. సిద్దార్థ, సివిల్ విభాగం నుండి ఆర్.శృతి లు ప్రతిభ కనబరిచి.ఈ పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా , విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలోనూ ప్రతిభ కనబరుస్తూ రాబోయే పోటీలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, విభాగాధిపతులు, పి. డి లు,విభాగాధిపతులు అభినందించారు.

# మార్చి 24న జిల్లా స్థాయి మాస్టర్స్ క్రీడా పోటీలు

(నవతరం - శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీన నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జిల్లా స్థాయి 'శాప్' లీగ్ మాస్టర్స్ (వెటరన్స్) క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్లు 45 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్‌లోని వివిధ విభాగాల్లో (పరుగు పందట్లలు, జంప్స్, త్రోస్) ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 30, 31 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, ఆసక్తి గల వారు వెంటనే sports.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9390352942 నంబర్‌ను సంప్రదించవచ్చని మహేష్ తెలిపారు.

# 22న జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

(నవతరం - శ్రీకాకుళం)

జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 22వ తేదీన జడ్పీ స్థాయి సంఘాలను సమావేశాలు నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ అధ్యక్షతన ఉదయం 10:30 గంటల నుంచి వరుసగా ఏడు స్థాయి సంఘాల సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 10:30కు 6వ స్థాయి సంఘం, 11:30కు 3వ సంఘం, మధ్యాహ్నం 12:30కు 5వ సంఘం సమావేశం కాగా.. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 2, 4, 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో ఈ సమావేశాలకు హాజరుకావాలని సీఈఓ కోరారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**